# స్త్రీ ఔదార్యము

శ్రీ డి. రాజేశ్వర్ గారు

ఒక గ్రామములో ఆత్మగౌరవముగల బ్రాహ్మణుడు కలడు. నిజాయితీకి కట్టుబడ్డ మనిషి. వానికొక భార్యగలదు. ఔదార్యము, నమ్రత, వినయములలో మొదటి స్థానమామెదే. వారిరువురు చిలుకా గోరింకలవలె చాల సుఖముగా కాలము గడుపుచుండిరి. అనుకూల దాంపత్యములో మొదట వారినే పేర్కొనవలెను. కాని భర్త న్యాయమునకు బద్ధుడై, ఏమాత్రమన్యాయము జరిగినను సహించక వెంటనే అన్యాయ పక్షమును శిక్షించవలెననెడి స్వభావము కలవాడు. విద్యార్హతలలో అంత గొప్పవాడు కానప్పటికీ, కుటుంబ వ్యవహారములను చక్కబెట్టుకొనుటకు కొద్దిపాటిచదువు గలదు.

అతనికి కొద్దిపొలమే జీవనాధారము. దానిని రైతులచే దున్నించి, కావలసిన ఎరువులు పెట్టి, సంవత్సరాంతమున గింజలను బళ్లకెక్కించి ఇంటికి తీసుకొని వచ్చుట పరిపాటి. రైతులు అనునిత్యము భూమిని గుఱించి జాగ్రత్తగా పాటుపడుచుందురు. కాని రైతులలో ఒక నీచుడున్నాడు. ఒకనాడు వాడు వెన్నెలరాత్రుల అర్ధరాత్రి సమయమున వీరి పెఱటిలోనున్న చింతచెట్టునెక్కి చింతకాయలు తెంపుచుండెను. చేసి, చేసి, దొంగతనము చింతకాయలే చేయాలి! దానితో కడుపు నిండునా? కుబేరుడౌనా? వాడి తుచ్ఛగుణము చూపించుకున్నాడు. అంతే! ఆసమయముననే సైలు కొఱకు పొలమునకు వెళ్ళుచున్న పంతులు వానినిచూచి “ఎవడురా నీవు? దిగు:” అని అరచెను. వాడు గజ గజ వణుకుచు చెట్టు దిగెను. తక్షణమే వానిని పోల్చి “ఓరీ దౌర్భాగ్యుడా! నీవేనురా? ఎందుకెక్కావ్ చెట్టు?” “లేదు బాబు. అమ్మగారు రేపటికి చింతకాయలు లేవురా, కోయరా పోలిగా అని అన్నారండి. అందుచేత కోస్తున్నాను” అన్నాడు. “అయితే పద - అమ్మగారి దగ్గరకు” అని వాడిపిలక పట్టుకొని తన యింటిలోనికి తీసుకొనివచ్చి భార్యను గద్దించి యడిగెను. ఆమె కొంచె మాలోచించి ఇప్పుడు నేను కోయమనలేదని జబాబిచ్చిన యెడల వాడి ప్రాణములు దక్కవని తలచి “ ఆఁ ... నిజమేనండి. రేపటికి పులుసులోకి లేవని కోయమన్నాను.” అన్నది. అప్పుడు పంతులు వానిని విడిచిపెట్టి పొలమునకు పోయెను. వాని భార్యగాని అట్లు చెప్పనిచో వాడిని చావగొట్టి విడిచిపెట్టెడివాడు. పంతులుగారు పోయినవెంటనే ఆ రైతు అమ్మ కాళ్ళు పట్టుకొని “అమ్మా! నాప్రాణము కాపాడినారు. మీమీద భారముపెట్టి వచ్చాను. మీమేలు యెన్నటికిని మఱువలేను.” అని చెప్పి ఆ మరుచటి దినమునుంచి ఆమె యేమి

చెప్పినయెడల ఆపని చేయుచు ఆమె అభిమానమునకు పాత్రుడయ్యెను. చూచితిరా! ఆ స్త్రీ ఔదార్యము.

ఇది 19 వ శతాబ్దములో నిజముగా జరిగిన సంగతి. నేడు అనగా 20 వ శతాబ్దములోకూడ మన స్వతంత్ర భారతదేశము (Free India) లో అట్టి స్త్రీలున్నారు. కాని చాల తక్కువ. ఎందుచేతననగా మన పురాతన హిందూ ధర్మశాస్త్రాదులను విస్మరించి, పాశ్చాత్య నాగరికతా వ్యామోహాగ్నిలో కూలబడిన శలభములైరి. అట్లుగాక హైందవ ధర్మప్రకారము స్త్రీలు ప్రవర్తించి భర్తయనురాగము సంపాదించి, ఆదర్శగృహిణి యనిపించుకొనుటకు ప్రయత్నించవలెను. ప్రయత్నమునకు ఫలము లభించకపోదు. భూమి (Earth) అక్షము అనే ఒక ఇరుసునెట్లు ఆధారము చేసుకొని భ్రమణము చేయుచున్నదో, అట్లే గృహమందలి బాగోగులు గృహలక్ష్మిపై ఆధారపడియున్నవి.

---

## చందమామ

స్వర్ణపీతాంబరద్యుతి సొరుమీర
నిర్మలాకాశ సౌధాన నిక్కినిక్కి
తరులతా పుష్ప గుచ్ఛ సత్కానుకతోడ
వేచియుండిన ప్రకృతి చేజాచిబిలువ
చలమ దేటికి జేసెదో చందమామ.
పాయసము బెట్ట బిలిచెడి పాప జూచి
దాగుమూతల కోరెడి తరులజూచి
పర్వులిడ వేగరమ్మను బాలుజూచి
జాగు చేసెద వేటికో చందమామ.
కలువకాంతలు నీకయి కలువరింప
కామినీ మణులెల్లరు కలువరింప
విఱ్ఱవీగిన కొంతైన వెఱపు గలుగు
తొంగిచూచిన దొంగని దోసమిడరె.

శా. వి.

---